# వాక్ క్షేత్రం-2

-బ్రహ్మర్షి పత్రీజీ



# "వాక్ క్షేత్రం - 2"

ఈ రోజు మనం మరికొన్ని సత్యాలనూ, సూత్రాలనూ, ఈ "వాక్ క్షేత్రం" అన్న కాన్సెప్ట్ గురించీ తెలుసుకుందాం.

ఇంతకుముందు "వాక్ క్షేత్రం-1"గా తెలుసుకున్న దాంట్లో మూడు క్షేత్రాలను సవివరంగా తెలుసుకోవడం జరిగింది. ఒకటేమో భావనాక్షేత్రం, రెండవది వాక్‌క్షేత్రం, మూడవదేమో చేష్టాక్షేత్రం. The field of thoughts, the field of words and the field of actions.

ఈ రోజు మనం మరికొన్ని సత్యాలను తెలుసుకుందాం. ఈ "వాక్ క్షేత్రం-2" గా కొన్ని క్రొత్త విషయాలను మనం మరొక కాన్సెప్ట్‌గా తెలుసుకుందాం. ఈ కాన్సెప్ట్ పేరు "పిరమిడాయణం."

ఈ "పిరమిడాయణం" గురించి మనం ఈ రోజు విపులంగా తెలుసుకుందాం. ఈ "పిరమిడాయణం" అనే కాన్సెప్ట్ గురించి తెలుసుకునే ముందర నేను ఒక పాట పాడుతాను ఈ పాటలో నుంచి మనం ఈ యొక్క కాన్సెప్ట్ లోకి వెళదాం.

**'రఘుపతి రాఘవ రాజారామ్, పతీత పావన సీతారామ్।**
**ఈశ్వర్ అల్లా తేరేనామ్, సబ్‌కో సన్మతి దే భగవాన్॥"**

ఈ పాట భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా కూడా అందరికీ తెలి సిన పాట! ఎప్పుడూ గాంధీగారు పాడుతూండేవారు. "గాంధీ గారు దేనికి ప్రతీక?" అంటే రకరకాల విషయాలు అందరూ చెప్తూంటారు. 'సత్యం' , 'అహింస', 'దేశభక్తి' ఈ విధంగా ... అయితే మనం ఏ విధంగా ఆయన్ని విశ్లేషించుకుంటామంటే "మహాత్మాగాంధీ గారు విశుద్ధ చక్రానికి ప్రతీక".

మానవాళి ఏడు రకాలుగా విభజింపబడింది! మూలాధార తత్త్వంలో ఉన్నవారు, స్వాధిష్ఠాన తత్వంలో ఉన్నవారు, మణిపూరక తత్వంలో ఉన్నవారు, అనాహత తత్త్వంలో ఉన్నవారు, విశుద్ధ తత్త్వంలో ఉన్నవారు, అజ్ఞాతత్త్వంలో ఉన్నవారు మరి సహస్రార తత్త్వంలో ఉన్నవారు. ఏడు రకాల తత్త్వాలుగా మానవాళిని విభజించవచ్చు. అందులో విశుద్ధ తత్త్వానికి ప్రతీకగా మనకు గాంధీ గారు కనబడతారు.

ఈ ఏడు రకాల తత్త్వాల వాళ్ళ గురించి మనం కొద్దిగా తెలుసు కుందాం. మొదటిగా మూలాధార తత్త్వం గురించి తెలుసుకుందాం. "మూలాధారతత్త్వం" అంటే ఇది "భౌతిక కాయ తత్త్వం". ఇది భౌతిక శరీర

తత్త్వం. ఎవరైతే "నాకు పెళ్ళి కావాలి. నాకు కొడుకు పుట్టాలి, నాకు కూతురు పుట్టాలి. అని ఈ విధంగా ప్రార్థనలు చేస్తూంటారో వాళ్ళందరూ కూడానూ మూలాధార తత్త్వంలో ఉన్నవారు. వాళ్ళకి కేవలం భౌతికమే కనబడుతుంది. ఇంకేమీ కనబడదు.

తరువాత రెండవ తత్త్వంలో ఉన్న వారెవరయ్యా అంటే "స్వాధిష్టాన తత్త్వం"లో ఉన్నవారు, వారికి భౌతిక పదవులు కావాలి. "నేను M.L.A గా ఉండాలి". నేను M.Pగా వుండాలి; మరి నాకే అందరూ ఓట్లు వేయాలి". అని ఈ విధంగా ప్రాపంచిక, అల్పమైన ప్రతిష్టల కోసం ప్రార్థనలు చేస్తూంటారు. భగవంతుణ్ణి ఇలాంటి వాళ్ళంతా "స్వాధిష్టాన తత్త్వం"లో ఉన్నవారు.

ఇకపోతే, మణిపూరక....... వీరు భగవంతుణ్ణి విద్య కోరుకుంటారు. "నాకు సంగీతం రావాలి; నాకు సంస్కృతం రావాలి; నేను M.B.B.S పాస్ అవ్వాలి; నాకు M.D లో సీట్ కావాలి, నేను అమెరికాకు పోయి రిసెర్చ్ చేయాలి" అని ఈ విధంగా ప్రార్థనతో భగవంతుణ్ణి వేడుకుంటారు. వీరందరూ "మణిపూరక తత్త్వం"లో వున్నవారు! ఈ మూలాధార, స్వాధిష్టాన, మణిపూరక చక్రాలను "క్రింది మూడు చక్రాలు" అంటాం. ఇవి పూర్తిగా ప్రాపంచికం, లౌకికం.

నాల్గవది అనాహతం. ఇటు పూర్తిగా లౌకికమూ కాదు. అటు పూర్తిగా ఆధ్యాత్మికమూ కాదు. మధ్యలో ఉన్నవారు ఇలాంటి తత్త్వంలో ఉన్నవారు. లౌకికంతో విసిగిపోయిన వారు ఏం కోరుకుంటారు అంటే "నాకు లౌకికంగా ఏదీ అక్కరలేదు", నాకు మనఃశ్శాంతి కావాలి. I want peace of mind Oh, Lord!" అంటూ ప్రార్థన చేస్తూ వుంటారు.

ఇకపోతే ఐదవ "విశుద్ధ తత్త్వంలో" ఉన్నవాళ్ళు, అంటే తమకు తాముగా పూర్తిగా శాంతి పొందినవాళ్ళు. విశుద్ధ తత్త్వంలో ఉన్నవారు........ వీరు భగవంతుణ్ణి ఏం కోరుకుంటారు అంటే వీరు తమ కోసం ఏమీ కోరుకోరు! తమ కోసం పొందవలసిన శాంతినంతా పొందారు, "మిగతా వాళ్ళకి 'సన్మతి' ఇవ్వు భగవాన్", "సబ్‌కో సన్మతి దే భగవాన్" అంటూంటారు. చూశారా ఆ పాటలో! వీరు తమ కోసం ఏదీ కోరుకోరు. జగత్తు కోసం కోరుకుంటారు. జగత్తు కోసమైనా ఏం కోరుకుంటారు. 'లౌకికంగా' కోరుకోరు! వాళ్ళకు బట్టలు కావాలని కోరుకోరు! వాళ్ళు బాగా బ్రతకాలని కోరుకోరు! వాళ్ళకు కొడుకులు పుట్టాలని కోరుకోరు! వాళ్ళకు పేరు ప్రతిష్టలు రావాలని కోరుకోరు! వాళ్ళందరికీ శాంతి రావాలని కూడా కోరుకోరు! వారికి 'సన్మతి'ని భగవంతుడు ప్రసాదించాలి!

"సన్మతి" అంటే "Right intellect!" "Oh Lord! give every body that right intellect whereby they can see every where oneness!"

ఈశ్వర్ అల్లా తేరే నామ్! ఈశ్వరుడు వేరే, అల్లా వేరే అను కుంటున్నారు! "అంతా ఒక్కటే" అన్న ఆ 'సన్మతి' ఉందే అది వీళ్ళకి ఇవ్వండి" అని వేడుకుంటున్నారు! చూశారా ఎంత చక్కటి ప్రార్థనో! ఈశ్వర్ అల్లా తేరే నామ్, సబ్‌కో సన్మతి దే భగవాన్! అంతా ఒక్కటే. ఉన్నది ఒక్కటే రకరకాలుగా లేరు. ఈ మతాలంతా కూడానూ పిచ్చిమాటలు. "ఉన్నది ఒక్కటే! అలాంటి సన్మతి అందరికి ప్రసాదించండి" అని వీరు.... ఐదవ స్థితిలో ఉన్నవారు, అంటే విశుద్ధ స్థితిలో ఉన్నవారు..... ఏడవ స్థితిలో ఉన్న భగవంతుణ్ణి వేడుకుంటున్నారు. ఇది చివరి ప్రార్థన. ఆపై ఇక "ప్రార్థనలు" ఉండవు! ఆజ్ఞా చక్రంలోనూ, మరి సహస్రారంలోనూ ప్రార్థనలు వుండవు! అక్కడ "ధ్యానం" ఉంటుంది. అక్కడ "అడగడం" ఉండదు! "ఇవ్వడం" ఉండదు! బోధించడం వుంటుంది!

వీళ్ళు పై స్థితిలో వున్నవాళ్ళు. వీళ్ళు క్రింది స్థితిలో ఉన్నవారికి ఆదర్శ పురుషులు. సహస్రారం కన్నా పైన స్థితి లేదు. కనుక, ఈ ఏడవ స్థితిలో వున్నవాళ్ళు, సహస్రార స్థితిలో వున్నవాళ్ళు, ఒక కృష్ణుడు, ఒక జీసస్, ఒక శివుడు, వీళ్ళందరూ కూడానూ ఆ సహస్రారానికి ప్రతీక. అలాగే గాంధీగారు విశుద్ధ చక్రానికి ప్రతీక, ప్రార్థన అనేది విశుద్ధ చక్రంలో అంతమవుతుంది.

ఈ ప్రాపంచికమైన, అశుద్ధమైన జనాలకు కేవలం విశుద్ధమైన వాళ్ళే కనబడతారు. అంతకన్నా పైనున్నవాళ్ళు కనబడరు. అలా కనబడడం అసహజం. విశుద్ధమైన మహాత్ములే ఈ యొక్క ప్రపంచానికి కనబడతారు. ఆజ్ఞాచక్రంలో ఉండేవాళ్ళు సహస్రారంలో ఉండేవాళ్ళూ వీళ్ళకు అర్థం కారు. వాళ్ళని "సామాన్యమైన మనుషు"లను కుంటారు. లేకపోతే "పిచ్చివాళ్ళ"ను కుంటారు. కానీ విశుద్ధ చక్రంలో ఉండే వాళ్ళకే ఆజ్ఞా చక్రంలో ఉండే వాళ్ళు, సహస్రారంలో ఉండే వాళ్ళు అర్థమవుతారు.

కనుకనే గాంధీ గారికి శ్రీరాముడు ఆదర్శపురుషుడు. ఆయన గురించి "రఘుపతి రాఘవ రాజారామ్" అంటూ, "హే రామ్" అంటూ ఆయన శరీరాన్ని వదిలిపెట్టారు. శ్రీరాముడు దేనికి ప్రతీక? ఆయన సహస్రారంలో ఉన్న మాస్టరైనా కూడా విశుద్ధ చక్రానికి సంబంధించిన నాటకంలో రోల్ తీసుకుని విశుద్ధ చక్రానికి ప్రతీకగా మనకు రామాయణంలో నిలిచారు.

భారతదేశంలో కొన్ని శతాబ్దాలుగా ఒక అద్భుతమైన ఆయణం

"రామాయణం" అనేది ప్రసిద్ధి గాంచింది. ప్రతి భారతీయుడి నర నరాల్లోనూ ఇంకి ఉంది "రామాయణం". "రామాయణం" అంటే అది "శ్రీరాముని కథ" అక్కడ సీత, లక్ష్మణుడు, రావణాసురుడు కూడా ద్వితీయశ్రేణి పాత్రలు, మౌలికమైన పాత్ర శ్రీరాముడే.

"రామాయణం" అంటే?

అది శ్రీరాముని కథ.

"శ్రీరాముని కథ" అంటే ఏమిటి?

అది "పితృవాక్య పరిపాలన" అని అందరికీ తెలుసు.

తండ్రి ఎలాంటి వాడైనా సరే, ఎంత అధముడైనా సరే రాముడు అతని మాటకు బద్దుడు. రాముడు తండ్రి మాట జవదాటడు. తండ్రి అల్పుడే కానీ, కొడుకు మటుకు ఘనుడు! "తండ్రి తనకు శరీరం ఇచ్చాడు. కనుక ఈ శరీరంతో చేసే పనులన్నీ తండ్రి కోసమే". కనుక, ఈ విధమైన ఆచరణ అన్నది..... భౌతిక కాయంతో అజ్ఞానంతో ఉండే అశుద్ధ ఆత్మలకు ఇది "గొప్ప ఆదర్శం" గా వుంటుంది. అందుకే ఇన్ని వేల సంవత్సరాలుగా భారతదేశంలో కానీ, ప్రపంచంలో గానీ రామాయణం అనేది ఆదర్శంగా నిలించింది. అయితే ఇప్పుడు రోజులు మారిపోతున్నాయి! ఇప్పడొక కొత్త ఆయణంలోకి మనం ప్రవేశిస్తున్నాం. ఇంక "రామాయణం" అనేది పాత చింతకాయ పచ్చడి! ఈ రోజు మనం కొత్త ఆయణంలోకి ప్రవేశిస్తున్నాం. ఈ ఆయణం పేరు "పిరమిడాయణం"!

## "పిరమిడాయణం!"

"పిరమిడాయణం" అంటే ఇది పిరమిడ్ మాస్టర్ల కథ! న్యూ ఏజ్ మాస్టర్ల కథ! ఇక్కడ "పితృవాక్య పరిపాలన" అనేది ఉండదు! ఇక్కడ "సత్యవాక్ పరిసాధన" అనేది ఉంటుంది! "పిరమిడ్ మాస్టర్ల కథ" అంటే "సత్యవాక్ పరిసాధన". ఇక్కడ తండ్రి పనికిమాలిన వాడైతే ఎవరూ తండ్రి చెప్పిన మాట వినరు. తల్లి మాట వినరు. తల్లిదండ్రులు పనికి వచ్చే వారైతేనే వాళ్ళ మాట వింటారు. అలాగే భర్త పనికొచ్చే వాడైతే భర్త మాట వింటాం. భార్య పనికొచ్చేదైతే వాళ్ళ మాటలు వింటాం. కనుక, ఇక్కడ పిరమిడ్ మాస్టర్లు సత్యవాక్ పరిసాధకులు.

ఉదా: ప్రహ్లాదుడు సత్యవాక్ పరిసాధకుడు. తండ్రి హిరణ్యకశిపుడు, "హిరణ్యకశ్యపాయనమః" అని చెప్పేసి, తానే ఈ భూమండలాన్ని పరిపాలించేది, తన పేరే జపించమని చెప్పాడు. ప్రహ్లాదుడు ఒప్పకోలేదు. "ఈ కనబడేది సత్యం కాదు; కనపడనిది వేరే ఉంది. అదే సత్యం" అని ఆయన తండ్రిని ఎదిరించాడు! సవినయంగా ఎదిరించాడు! ధూర్తుడుగా

ఎదిరించలేదు. తండ్రితో చంపబడడానికీ సిద్ధం! తండ్రిని చంపడానికీ సిద్ధం ! కనుక ఇదీ పిరమిడ్ మాస్టర్ల కథ; న్యూ ఏజ్ మాస్టర్ల కథ.

ఇది విశుద్ధ చక్రానికి సంబంధించినది కాదు. ఇది సహస్రానికి సంబంధించిన కథ. సహస్రార స్థితిలో ఉన్న వారంతానూ సత్యవాక్ పరిసాధకులు! పిరమిడ్ మాస్టర్లు అంతా కూడానూ సత్య వాక్ పరిసాధకులు.

కనుక ఈ రోజు మనం ఈ "వాక్ క్షేత్రం - 2"లో ఈ పిరమిడ్ మాస్టర్ల గురించి, సత్యవాక్య పరిసాధన గురించి తెలుసుకోబోతున్నాం. పిరమిడ్ మాస్టర్లు శ్రీరాముని సంతతి కాదు. శ్రీ ప్రహ్లాదుని సంతతి. అవసరమైతే నరసింహ అవతారం ఎత్తుతారు! ఎత్తి భూమిని ప్రక్షాళనం చేస్తారు! భూమండలాన్ని మూర్ఖత నుంచి, అజ్ఞానం నుంచి ప్రక్షాళనం చేసే బాధ్యత ఈ పిరమిడ్ మాస్టర్లదే! ఈ బాధ్యత ఎలా నెరవేరుస్తారు? మన నోట్లో నుంచి వచ్చే మాటల ద్వారా! ఎవ్వరినీ మనం చంపం! గొప్ప ఆయుధం పట్టం! శ్రీకృష్ణుడు ఆయుధం పట్టలేదు. మహాభారత యుద్ధంలో ఆయన నోటి మాటే గీత. ఆ గీతని జవదాటిన వాళ్ళు అధోగతి లో ఉంటారు. ఈ గీతను పాలించిన వాళ్ళు ఊర్ధ్వగతిలో ఉంటారు. కనుక పిరమిడ్ మాస్టర్ల ఆయుధాలు కూడానూ వారి యొక్క వాక్కులే!

వాక్కులనేవి మూడు రకాలుగా ఉంటాయి.

**1) అశుభ వాక్కులు, 2) శుభ వాక్కులు, 3) సత్య వాక్కులు.**

"వాక్కులు" అంటే మన నోటిలో నుంచి వచ్చే మాటలే! జీసస్ క్రైస్ట్ అన్నాడు "What goes into the mouth, that does not defileth a person. What comes out of the mouth that defileth a person". ఎంత చక్కగా చెప్పారో, ఆ యొక్క సహస్రార స్థితిలో ఉన్న గ్రాండ్ మాస్టర్! అంటే మానవుడి నోట్లోకి ఏం వెళ్తుందో అది మానవుణ్ణి మలినపరచదు! మానవుని నోట్లో నుంచి ఏం వస్తాయో అవే మానవుణ్ణి మలినపరుస్తాయి! మానవుడి నోట్లో నుంచి ఏదొస్తుంది? వాక్కులొస్తాయి? ఈ వాక్కులు "అశుభ వాక్కు"లనీ, "శుభ వాక్కు"లనీ , "సత్యవాక్కు"లనీ మూడు రకాలు. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరకలో ఉండే వారంతా అశుభ వాక్కులనే పలుకుతూ ఉంటారు. అలాగే అనాహత, విశుద్ధలో ఉండే వారంతా శుభ వాక్కులే పలుకుతూ ఉంటారు. ఆజ్ఞా, సహస్రారలో ఉండే వాళ్ళ నుంచి, వారి నోట్లో నుంచి, అశుభ వాక్కులు, శుభ వాక్కులు రావు...... ఎప్పుడు సత్యవాక్కులే వస్తాయి.

కనుకనే శ్రీకృష్ణుడు "శుభా శుభ పరిత్యాగీ" అన్నాడు! శుభం వద్దు, అశుభం వద్దు. ఈ రెండింటి పరిత్యజించండి. అశుభమైనది

ఇనుప సంకెళ్ళయితే, శుభమనేది బంగారు సంకెళ్ళు. కానీ మొత్తానికి సంకెళ్ళే! ఎవరు "ఇంకొకరికి మంచి చేస్తాను" అనుకుంటాడో, మంచి వాక్కులను చెప్పడానికి ప్రయత్నిస్తాడో... వాడు అసత్యంలో జీవిస్తున్నవాడు. ఎందుకంటే ఎవరూ ఇంకొకరికి మంచి చేయలేరు! ఎవరి కర్మనే వాళ్ళు అనుభవిస్తారు! ఒకడు ఇంకొకడికి చెడుపు చేయడం కానీ, మంచి చేయడం కానీ రెండూ అసంభవం.

ఒక తరగతిలో టీచర్ బాగా చెప్తూ ఉన్నాడంటే స్టూడెంట్స్ ఎవరైతే బాగా వింటారో వారే బాగా నేర్చుకోగలరు. ఎవరైతే వినరో వాళ్ళు నేర్చుకోలేరు. టీచర్ ఎంత గొప్పవాడైనా సరే! కనుక టీచర్ వల్ల ఎవరూ నేర్చుకోరు. వారి వారి శ్రద్ధ, భక్తుల వల్ల వారు నేర్చుకుంటారు. ఎవరికి వారే అజాగ్రత్తతో కూడి వుంటే వారి క్రింద జారిపోతుంటారు. ఎవరికి వారే బంధువు. ఎవరికి వారే శత్రువు. "ఉద్ధరేదాత్మనాత్మానాం ఆత్మానమవసాదయేత్......

అన్న శ్రీకృష్ణుడి సత్యవాక్కు పిరమిడ్ మాస్టర్లందరికీ ఆదర్శం! కనుక, పిరమిడ్ మాస్టర్లందరూ కూడానూ నోట్లో నుంచి మాటలు వచ్చినప్పడు "అశుభ వాక్కులొస్తున్నాయా? వద్దు, వద్దు" అని వాటిని తీసేసుకుంటారు. "శుభ వాక్కులొస్తున్నాయా? అవి కూడా వద్దు, వద్దు" అని తీసేస్తూంటారు. కేవలం సత్య వాక్కులే పలుకుతారు! "నేను నీకు గురువును, నేను నీకు మంచి చేస్తాను, నేనే నిన్ను ఆశీర్వదిస్తాను" అనే మాటలు వారి నుంచి రావు! ఎవరైనా ఆశీర్వాదం కోరుతూ ఉంటారు. "ఆప్ కే ఆశీర్వాద్ చాహి యే" అంటూంటారు. కానీ ఆశీర్వాదం ఇచ్చేవాడు ఇక్కడ లేడు! ఎందు కంటే వీరు సత్య వాక్ పరిసాధకులు. నేను 'ఆశీర్వాదం' ఎలా ఇస్తాను? మీ కర్మలే నీకు ఆశీర్వాదం! మీ ఆలోచనలే మీ ఆశీర్వాదం. మీ యొక్క పరిశోధనే, మీ యొక్క పరిసాధనే మీ ఆశీర్వాదం! ఇదే సత్య వాక్ పరిసాధన.

కనుక, ప్రహ్లాదుడు ఆయన తండ్రిచే ఎంత హింస చేయబడినా, చావుకు కూడా భయపడకుండా చిరునవ్వుతో...... అంత చిన్న బాలుడే........ ఆయొక్క చావును స్వీకరిస్తూ, ఎప్పడూ సత్య వాక్ పరిసాధనలో, అంతగా జీవించినప్పడు, మనం ఇంకెంతగా అలా జీవించాలి! పిరమిడ్ మాస్టర్లు అందరూ కూడానూ సత్య వాక్య పరిసాధకులు! సత్య వాక్కులు జీసస్ నోట్లోంచి ఎప్పడూ ప్రవహించేవి సత్యవాక్కులే! కృష్ణుని నోట్లోంచి ఎప్ప డూ ప్రవహించేవి సత్యవాక్కులే! శివుని దగ్గరి నుంచి కానీ, రమణ మహర్షి దగ్గరి నుంచి కానీ, ఏ మహాత్ముని దగ్గరి నుంచి గానీ ప్రవహించేవి సత్య వాక్కులే! వాటి గురించి మరికొన్ని విషయాలు మనం తెలుసుకుందాం.

ప్రహ్లాదుడు సత్యవాక్ పరిసాధకుడు. ఎన్ని హింసలు పెట్టినా ఆయన నోట్లోంచి ఒకటే మాట వచ్చింది. ఒకటే పాట వచ్చింది. ఏమిటా పాట?

"నారాయణ" అంటే "ఆత్మ!" "నర" అంటే "మానవ!" మానవ శరీరంలో యానం చేసింది ఆత్మ. ఎప్పుడూ ఆత్మతత్త్వం గురించే చెప్పాడు ప్రహ్లాదుడు.

అలాగే - పిరమిడ్ మాస్టర్లందరూ కూడానూ.

"నాకు తలకాయ నొప్పి వచ్చింది" అంటే "ఆనాపానసతి చేయండి" అంటాం.

" B.P ఉంది" అంటే "ఆనాపానసతి" చేయండి .

"ఇంట్లో సమస్యలు వచ్చాయి" అంటే "ఆనాపానసతి చేయండి".

"ఆర్థికంగా చితికిపోయా"మంటే "ఆనాపానసతి చేయండి".

అలాగ, ఎలాంటి ప్రాబ్లమ్స్ వచ్చినా మనం ఆనాపానసతినే చెప్తాం. కనుక మనం ఈ పాటను పాడుతాం.

"ఆనాపానసతి, ఆనాపానసతి'... " అలాగే ఎవరి వాస్తవాన్ని వాళ్ళే సృష్టించుకుంటున్నారు. ఇందాకే చెప్పాం కదా! "ఉద్ధరేదాత్మనాత్మనం" ... అని కనుక "నేను నీకు ఏమి చేయలేను బాబూ! నేను నిన్ను ఆశీర్వదించలేను! అది అసంభవం! నిన్ను నువ్వే ఆశీర్వదించుకో! అప్పో దీపో భవ! "అనునిత్యం మనం అదే పలుకుతూంటాం. కనుక మన పాట ఏమిటి "అప్పో దీపో భవ, అప్పో దీపో భవ..... నీ వాస్తవాన్ని నీవే సృష్టించుకుంటావు. ఎవరి మీదా పితూరీలు చేయకు" అని చెప్పి ఈ విధమైన మాటలు అందరితో సవినయంగా మాట్లాడటం, ఇదే సత్య వాక్య పరిసాధన. సవినయంగా సత్యం మాట్లాడటం, ఎప్పుడో అవసరమైతే అవినయంగానూ సత్యం మాట్లాడటం.

రమణ మహర్షి దగ్గరికి ఎవరెళ్ళినా ఆయన చెప్పేవాడు. "నువ్వెవరో నీకే తెలియదు. నీ సమస్యలు ఎలా పోతాయి నాయనా?" అనేవాడు. ఆయన జీవితాంతం ఆయన నోట్లో నుంచి ఈ ముక్కలే వచ్చాయి! ఇదీ సత్యవాక్కు పరిసాధన అంటే. ఒక జీవితకాలం ఆయన మౌనంగా వున్నాడు. నోరు విప్పినప్పడు మట్టుకు "నిన్ను నువ్వు తెలుసుకో" అన్నాడు! అంతే ఆయన చేసింది. అదే ఒక మహర్షి లక్షణం.

రమణమహర్షి ఆజ్ఞాచక్రానికి ప్రతీక. శ్రీకృష్ణుడు సహస్రారానికి ప్రతీక. కనుక క్రింది మూడు చక్రాలలో ఉండే వాళ్ళు అశుభ వాక్కులకు ప్రతీకలు. అనాహత, విశుద్ధ చక్రాలలో ఉండే వాళ్ళు శుభ వాక్కులకు

ప్రతీకలు. ఆజ్ఞా, సహస్రార చక్రాలలో ఉండే వాళ్ళు ఎప్పుడూ సత్య వాక్కులకు ప్రతీకలు. పిరమిడ్ మాస్టర్లు సత్యవాక్కులకు ప్రతీకలు.

జీసస్ ఒకసారి పదకొండు ఏళ్ళ వయస్సులోనే అందరికీ సత్యవాక్కుల బోధన చేస్తున్నాడు. ముసలివాళ్ళంతా ఆయన చుట్టూ కూర్చున్నారు. సత్యవాక్కుల గోష్టి జరుగుతూ వుంది. ఇంతలో వెనుక నుంచి ఒక అబ్బాయి "ఓ జీసస్! మీ తల్లిగారు పిలుస్తున్నారు; నీవు అర్జంటుగా వెళ్ళాలట" అన్నప్పుడు ఈయన వెనుతిరిగి "ఎవరు నా తల్లి? ఆ దేవుని రాజ్యంలో ఉన్న నా తండ్రి వాక్కును ఎవరు పరిపాలిస్తారో వారే నా తల్లిదండ్రులు! ఇంకెవరూ నా తల్లి, నా తండ్రి కాజాలరు" అన్నాడు! చూశారా ఎంత చక్కగా ఆయన నోట్లో నుంచి సత్య వాక్కులొచ్చాయో! భౌతికమైన తల్లి 'తల్లి' కాదు, భౌతికమైన తండ్రి, 'తండ్రి' కాదు. కనుకనే శంకరాచార్యుల వారు "కస్త్వం కోహం కుత ఆయాతః, కామే జననీ........ అన్న శ్లోకం పలికారు.

"ఎవరు నేను? ఎవరు నువ్వు? ఎవరు నా తల్లి? ఎవరు తండ్రి?" ఈ విధంగా ప్రశ్నించాడు. "ఎవరైతే ఇదంతా స్వప్నం అని తెలుసుకుంటారో వారే నా యొక్క సోదరుడు". ఈ విధంగా ఎప్పుడూ సత్యవాక్ పరిసాధకుడు జీసస్. అలాగే ఒకసారి ఆయన రోడ్డు మీద వెళ్తూంటే ఆయన బట్టలు ముట్టుకుంటే వారి రోగాలన్నీ పోయాయి. అప్పుడు ఆయన వెనుతిరిగి "Who touched my robes?" ఎవరు నా వస్త్రాలను ముట్టుకున్నారు?" అని ప్రశ్నించగా "స్వామీ! మేమే ముట్టుకున్నాం. మా రోగాలన్నీ పోయాయి" అని అన్నప్పుడు ఆయన అన్నాడు. "your faith has healed you" "మీ యొక్క విశ్వాసం మీ స్వస్థతను చేకూర్చింది", అని! ఆయనెప్పుడూ "నేను నీకు చేశాను" అనలేదు! ఎందుకంటే తాను ఎవరికైనా ఏమైనా చేయడం అసంభవమని ఆయన తెలుసుకున్నారు కనుక.

"ఆవగింజంత విశ్వాసమున్నా మనం పర్వతాలను కదలించగలం" అని ఆయన ఎంత చక్కగా సత్యవాక్కులు చెప్పారో! జ్ఞానం లేనప్పుడు విశ్వాసం ప్రధానం. జ్ఞానమున్నప్పుడు విశ్వాసం ఉండదు. కేవలం విశ్వాసం తో పోయే వాళ్ళు సహస్రారంలో ఉన్నవారి మీద విశ్వాసం ఉన్నా చాలు, ఆ మాట మీద నిలబడి ఏకాగ్రతతో! ఒకే ఒక విశ్వాసంతో, ఏ పలుకు పలికినా అది ఫలిస్తుంది! కానీ "అవుతుందో లేదో"..... ఈ విధమైన ద్వంద భావాలలో ఉన్నప్పుడు ఏదీ జరుగదు. అంటే విశ్వాసం లేదన్నమాట అక్కడ ఆవ గింజంత విశ్వాసం ఉన్నా ప్రపంచాన్ని కదిలించగలం", అని ఎంత అద్భుత మైన సత్యవాక్కు, మనకు ఆయన ప్రసాదించారో!

అలాగే ఇంకొంతమంది రోగులు "ఆయన బట్టలు ముట్టుకుంటే

రోగాలన్నీ పోతాయా? అలా అయితే ఇంత మంది డాక్టర్లు ఎందుకు? M.D లు ఎందుకు?" అని వారు కూడా పోయి ముట్టుకున్నారు. కానీ వాళ్ళకేమీ జరుగలేదు! అప్పుడేం చెప్పారు. "మీకు విశ్వాసం లేదు. మీకు కూడా విశ్వాసం ఉండి ఉంటే, మీరు కూడా స్వస్థులై వుండేవారు. వెంటనే తక్షణమే", జాప్యం లేదు "ఖుదాకీ దునియా న దేర్ హై, న అంధేర్ హై!" దేవుని రాజ్యంలో జాప్యం లేదు. మన ఆలోచనలో ఆలస్యం ఉంది కానీ భగవంతుని సృష్టిలో ఎక్కడా ఆలస్యముండదు. మన విశ్వాసం అచంచలంగా ఉన్నప్పుడు వెంటనే. తక్షణమే, కోరుకున్నది జరుగుతుంది. కనుక దేవుని ప్రపంచంలో ఉండే వాళ్ళే సహస్రారంలో ఉండేవాళ్ళు; ఆరు చక్రాలు దాటి చక్రాతీత స్థితిలో ఉన్నవాళ్ళు సహస్రదళ కమలంలో స్థితులైనవారు; వేయి పడగల పాము విలసిల్లుతున్న వాళ్ళు.

పిరమిడ్ మాస్టర్లు అందరూ కూడానూ సత్యవాక్కు పరిసాధకులు. ఒకసారి ఏమైందంటే మా రెండో అమ్మాయి పుడుతున్న సమయం. మా అన్నగారు అప్పుడే హాంగ్‌కాంగ్ నుంచి వచ్చారు. అభినందనలు చెప్తున్నారు. "నీకు కూతురు పుట్టిందిరా" అనేసి అప్పుడు నేను హాస్పటల్‌లో లోబ్‌సాంగ్ రాంపా గారి పుస్తకం చదువుకుంటున్నాను. "You Forever" మా అన్న గారితో అప్పుడు నేనన్నాను "నేను ఏ విధమైన గొప్ప పని చేశాను? పిల్లలు పుట్టించడంలో నా గొప్పదనం ఏముంది? అది ప్రకృతి సహజమైన చర్య. ప్రతి చీమ, ప్రతి దోమ కూడానూ పిల్లల్ని పుట్టిస్తుంది. నేను ఏదన్నా నా స్వంతంగా గొప్ప పని చేస్తే, ఒక సంగీత కచేరీ చేస్తే, ఒక గొప్ప పుస్తకంవ్రాస్తే అప్పుడు నాకు అభినందనలు చెప్పాలే కానీ పిల్లలు పుట్టినందుకు అభినంద నలా? ఏమిటి?" అని నా నోట్లో నుంచి వచ్చాయి. ఆయన ముఖం ఎర్ర బడిపోయి, మహాకోపం వచ్చేసింది. నా చేతిలోని పుస్తకం లాక్కొని చింపే సి హాస్పటల్ అంతా పడేశారు. నేను మళ్ళీ కాయితాలన్నీ ప్రోగు చేసుకుని, నా యొక్క పనిలో నిమగ్నమయ్యాను. ఇది సత్యవాక్కుకి ప్రతీక!

అలాగే నన్ను ఎందరో అడుగుతూంటారు. "మీ స్వంత ఊరు ఏది" అని! అలా అడిగితే నేను చెప్పను. "వైకుంఠపురం" అని చెప్తాను! కుంఠితం కానిదే వైకుంఠం. "నువ్వు, నేను" అనే వస్తువు పేరే "కుంఠితం", "వైకుంఠం" అంటే "ఎక్కడైతే నువ్వు నేను అనేది లేదో, ఎక్కడైతే అంతా ఏకమై వుందో" ఆ పరిస్థితి పేరు వైకుంఠం. మనం ఈ భూలోకంలో ప్రయాణీకులం మట్టుకే. మనమేమీ స్వంతదారులం కాము. హమ్ చన్ దిన్ కే ముసాఫిర్ హై! మనం ఇక్కడ పాంథులం. కనుక నేను వైకుంఠలోక వాసిని, అక్కడి నుంచి వచ్చాను.

నిజానికి మనమందరం కూడా సత్యలోక వాసులమే! అక్కడి నుండి దిగి వచ్చిన దేవుళ్లమే! శాశ్వత దేవుళ్లే తాత్కాలికంగా వచ్చిన మానవులు! ఈ సత్యం తెలుసుకున్న వాళ్లే సత్యం తెలుసుకున్న వాళ్ళు. మనం శాశ్వత మాధవులం. అప్పుడప్పుడూ మానవులుగా ఉంటాం. అప్పుడప్పుడూ ఇక్కడ ప్రయాణిస్తున్నప్పుడూ, ఈ భౌతిక కాయం ధరించినప్పుడు, మానవులుగా విహరిస్తుంటాం. వాస్తవంగా మనం ఎక్కడి వాళ్లం? సత్యలోక వాసులం. సత్యలోకంలో అనంతమైన చిన్న చిన్న లోకాలున్నాయి. ఒక వైకుంఠలోకమనీ, ఒక కైలాస లోకమనీ ఎన్నో ఎన్నో లోకాలు.

కనుక మన నోట్లోంచి, పిరమిడ్ మాస్టర్ల నోట్లోంచి, ఎప్పుడూ కూడాను సత్య వాక్కులే వస్తాయి. దేహపరమైన వాక్కులు రావు. ఎప్పటికప్పుడు జాగ్రత్త పడుతూండాలి. మన నోట్లోంచి ఎప్పుడు ఏ పలుకు వచ్చినా కూడానూ " ఆ పలుకు సత్యవాక్కుగా ఉందా? లేదా?" అని నోట్లోనే రిహార్సల్ చేసుకుని అప్పుడు నోట్లో నుంచి ముత్యాల్లాంటి సత్యవాక్కులనే ప్రవహింపచేయాలి. పక్కవాళ్ల మీద పితూరీలు కానీ, అశుభ వాక్కులు, కానీ, పక్కవాళ్లకు అనవసరం కానీ, అశుభ వాక్కులు కానీ, పక్కవాళ్లను అనవసరంగా పొగుడుతూ కానీ, వాళ్లకేదో మంచి చేస్తామని కానీ, శుభవాక్కులు కానీ, ఏవీ రాకూడదు. ఎప్పుడూ ప్రక్కవాళ్లతో మాట్లాడుతున్నప్పుడు "నీ గోల నీది, నా గోల నాది! నీ కర్మ నీది, నా కర్మ నాది! ఎవరికి వారే యమునా తీరే! కనుక ఎవరి వాస్తవాన్ని వాళ్లే సృష్టించుకుంటున్నారు. నీక్కావలసింది నువ్వు సృష్టించుకో. నాకు కావలసిందే నేను సృష్టించుకుంటున్నాను. నా దగ్గర ఉన్నది ఎప్పుడూ నేను కోరుకున్నదే. నేను కోరుకోనిది నా దగ్గర లేదు'' అని మాట్లాడుతూండాలి. ఏ మాత్రం ఎవరి మీదా పితూరీలు లేకుండా మాట్లాడటం ... ఇదే సత్య వాక్కు పరిసాధన అంటే. అందరినీ అదే స్థితికి తీసుకురాగలిగే మాటలు మాట్లాడడమే సత్య వాక్కు పరిసాధన అంటే.

పిరమిడ్ మాస్టర్లు పితృదేవోభవ, మాతృదేవో భవ, గురు దేవో భవ అని అల్పపు మాటలు మాట్లాడరు! సత్యమేవ జయతే! సత్యం దేవో భవ! తండ్రి హీనుడైతే వారి మాటలు వినం. పిరమిడ్ మాస్టర్లు శ్రీరాముని సంతతి కాదు, పిరమిడ్ మాస్టర్లు శ్రీ ప్రహ్లాదుని సంతతి. ప్రహ్లాదుడు అంత చిన్నవయస్సులోనే అంత సత్యవాక్ పరిసాధకుడయ్యాడు. మరి మనం ఇంత వయసొచ్చినప్పుడు, ఇంత ధ్యానం వచ్చినప్పుడు ఇంకెంత సత్యవాక్ పరిసాధన చేయవలె! ఇంకెంత పరిపక్వంగా మాట్లాడవలె!

గౌతమబుద్ధుడు అద్భుతమైన సత్యవాక్ పరిసాధకుడు! మనమంతా బుద్ధ సంతతి. బుద్ధ సంతతి అంటే బుద్ధి ఉన్న సంతతి. ప్రతి వాక్కు

కూడానూ బుద్ధిపరంగా ఉండేటట్లు చూసుకోవాలి. బుద్ధి లేకుండా మాట్లాడకూడదు. బుద్ధి సంపాదిస్తే కదా బుద్ధిపరంగా మాట్లాడేది. బుద్ధి ఎలా వస్తుంది? సిద్ధార్థుడు బుద్ధుడు ఎలా అయ్యాడు? అంకుఠిత ధ్యానం చేసి తన చిత్త వృత్తి నిరోధం చేసుకుని, దివ్యచక్షువు సంపాదన చేసుకుని, జన్మ సిద్ధాంతం తెలుసుకుని, కర్మ సిద్ధాంతం తెలుసుకుని.......... అప్పుడు బుద్ధుడు అయ్యాడు! మనం కూడా అదే విధంగా బుద్ధుడు అవగలం. ఇతరత్రా బుద్ధుడు కావడం అసంభవం కదా! ఇతరత్రా బుద్ధి రావడం అసంభవం కదా! బుద్ధి అంటే Right intellect, సన్మతి, గాంధీగారు చెప్పినట్లు "సబ్‌కో సన్మతి దే భగవాన్" , అంటే ఎవరిస్తారు? ఇది ఎవరికి వారు సంపాదించుకోవాలి.

త్యాగరాజస్వామి "జ్ఞానమొసగరాదా!" అని పాడారు. జ్ఞానం ఎవ్వరూ ఇవ్వలేరు. ఎవరికి వాళ్ళు యధావిధిగా దానిని సంపాదించుకోవాలి.

కనుక, ఎవరికి వారు అకుంఠిత ధ్యాన సాధన చేయాలి. ఆనాపానసతి..... 'ఆన' అంటే 'ఉచ్ఛ్వాస'. 'అపాన' అంటే 'నిశ్వాస'; 'సతి' అంటే కూడుకుని ఉండటం! మన ఉచ్ఛ్వాస నిశ్వాసలతో కూడుకుని వుండటం. ఈ విధంగా ధ్యానసాధన చేసినప్పుడు మనం తప్పనిసరిగా బుద్ధులమవుతాం. బుద్ధి వున్న వాళ్ళమవుతాం. అప్పుడు మన వాక్కులన్నీ బుద్ధి ఉన్నవాళ్ళ వాక్కులవుతాయి. సత్యవాక్కులవుతాయి. లేకపోతే బుద్ధిలేని వాక్కులవుతాయి; అశుభవాక్కులు, శుభవాక్కులు వెరసి అసత్య వాక్కులుగానే ఉంటాయి కానీ "సత్య వాక్కులు"గా మాత్రం ఎప్పుడూ కాజాలవు.

ఈ రోజు మనం "వాక్‌క్షేత్రం-2"గా, అంతకుముందు చెప్పకున్నట్లు "వాక్‌క్షేత్రం-1" కు అనుబంధంగా ఈ రోజు "వాక్‌క్షేత్రం-2"లో "పిరమిడాయణం" గురించి చక్కగా మనం తెలుసుకున్నాం. అయినా మళ్ళీ ఒక్కసారి ప్రస్తుతించుకుందాం.

అనేక సంవత్సరాలుగా రామాయణమనేది భారతదేశంలో ఉంది. రామాయణం అంటే శ్రీరాముని కథ. శ్రీరాముడంటే పితృవాక్య పరిపాలన. శ్రీరాముడు విశుద్ధ చక్రానికి ప్రతీక! కానీ ప్రస్తుతపు రోజుల్లో ఇది కాంతియుగం, నవ్యయుగం, న్యూ ఏజ్! ఇదంతా కూడానూ విశుద్ధయుగం కాదు సహస్రారయుగం. ఇది ఏడుకొండల యుగం. ఇది సహస్ర ఫణిసాయి యుగం. ఇది ఏడుకొండల యుగం. ఇది సహస్ర ఫణిసాయి యుగం. ఆజ్ఞాచక్రం. అంటే ధ్యానచక్రం, అంటే మూడవకన్ను, సుదర్శన చక్రం; మూడవ కన్ను ద్వారానే మనం ఏడుకొండల వాళ్ళమవుతాం.

కనుక ఈ నూతన యుగంలో చలామణి అయ్యే కథ పేరు "పిరమిడాయణం". "పిరమిడాయణం" అంటే "పిరమిడ్ మాస్టర్ల కథ". "పిరమిడ్ మాస్టర్లు ఎవరయ్యా?" అంటే ధ్యాన సాధన చేసి మూడోకన్ను సంపాదించుకుని తమ జన్మ పరంపరను తెలుసుకుని కర్మ సిద్ధాంతం యొక్క విశేషతను తెలుసుకుని ఆ విధంగా జ్ఞానంలో స్థితమైనవారే! ఏ రాష్ట్రంలో వున్నా, ఏ ప్రపంచంలో వున్నా, ఏ లోకంలో వున్నా పిరమిడ్ మాస్టర్ల యొక్క విశేషమైన కథ ఏమయ్యా అంటే అదే సత్య వాక్ పరిసాధన.

మానవుడి వాక్కులు మూడు రకాలుగా వుంటాయి. ఒకటి అశుభ వాక్కులు; రెండేమో శుభవాక్కులు; మూడవదేమో సత్యవాక్కులు! అశుభ వాక్కులు మూలాధార, స్వాధిష్టాన, మణిపూరక స్థితుల్లో ఉన్న వారికి ప్రతీకలు! శుభవాక్కులు అనాహత, విశుద్ధ స్థితులలో ఉన్న వారి నోట్లో నుంచి వస్తాయి. సత్యవాక్కులు ఆజ్ఞా మరి సహస్రారలో ఉండేవారికి వస్తాయి.

రమణ మహర్షిది అజ్ఞా స్థితి, శ్రీకృష్ణుడు సహస్రార స్థితి కనుక రమణ మహర్షిలో సత్య వాక్కులు మొదలయ్యాయి. అయితే పరిసమాప్తి కాలేదు. కానీ శ్రీకృష్ణుడిలో సత్యవాక్కులు పరిసమాప్తి అయ్యాయి. రమణ మహర్షి "నిన్ను నువ్వు తెలుసుకో" అన్నాడు. కానీ అది ఎలా తెలుసుకోవాలో చెప్పలేకపోయాడు. విచారణ చేయమన్నాడు. విచారణ చేస్తే ఏదీ రాదు, ఆలోచిస్తే ఏదీ రాదు. ఆలోచనలు తీసేస్తేనే అన్నీ లభిస్తాయి.

"యోగః చిత్తవృత్తి నిరోధః" కనుక అక్కడ ఆజ్ఞాచక్రానికి ప్రతీక కనుక అక్కడ సరిగ్గా చెప్పలేకపోయారు. రమణ మహర్షికి ఒక్కడు కూడా శిష్యుడు లేడు. ఆయన దగ్గర సరియైన బోధ లేదు. సరియైన సాధన ఉంది కానీ సరియైన బోధన లేదు. సరియైన సాధన ఉంది. కనుక ఆజ్ఞాచక్రానికి ప్రతీక. సరియైన బోధన లేదు కనుక సహస్రార స్థితికి ప్రతీక కాదు. అందుకే రమణుడు మహర్షి స్థితి దాకా ఎదిగాడే కానీ బ్రహ్మర్షి కాలేదు. వశిష్టుడు బ్రహ్మర్షి దాకా ఎదిగాడు. సత్యవాక్కులు అంటే, ఎప్పుడూ మూడు రకాలుగా చెప్పకోవచ్చు. ఒకటి ఆత్మతత్వాన్ని గురించీ, ఆధ్యాత్మికతను గురించీ, స్పిరిచ్యువల్ సైన్స్ గురించీ, యద్భావం తద్భవతి అన్న సూత్రాన్నీ గురించీ, అప్పో దీపో భవ అన్న సూత్రం గురించి పలికిన పలుకులే సత్యవాక్కులు.

ఆత్మానుభవం గురించి రాని వాక్కులు సత్య వాక్కులు కావు. అవి శుభవాక్కులు అవుతాయి కానీ సత్యవాక్కులు మాత్రం కావు. ఎందు కంటే వాటికి ఆ యొక్క ప్రతిభ వుండదు. ఆ యొక్క బలం వుండదు.

ఆత్మానుభవం నుంచి వచ్చే వాక్కులే సత్యవాక్కులు. అలాగే అందరినీ ఆత్మలుగా ప్రబోధిస్తూ, పలకరిస్తూ, సంభోధిస్తూ పలికే పలుకులే సత్యవాక్కులు! వాళ్ళని స్త్రీగానో, పురుషుడిగానో, తల్లిగానో, తండ్రిగానో, పిల్లాడిగా, గురువుగా సంబోధిస్తూ పలికే పలుకులు ఎంతమాత్రం సత్యవాక్కులు కాజాలవు.

కనుక పిరమిడ్ మాస్టర్లు వారు ఏ శరణు కోరి వున్నారు? సత్యం యొక్క శరణుకోరి ఉన్నారు. "Seek ye the truth and truth shall liberate you" అన్నారు, జీసస్! "Seek ye the truth" అంటే "సత్యం శరణం గచ్ఛామి."

"సత్యాన్ని తెలుసుకోనుడీ; సత్యాన్ని కాంక్షించుడీ; మరి మీరు ముక్తిని పొందుతారు" అని జీసస్ అన్నారు. పిరమిడ్ మాస్టర్లందరూ "సత్యం శరణం గచ్ఛామి" అనేవారు. తాము స్వానుభవం ద్వారా సత్యం తెలుసుకున్నాక తర్వాత నోట్లో నుంచి ఎప్పుడూ కూడానూ సత్యాన్ని పలకడం కోసమే దాని శరణు కోరే ఉంటారు; సత్యవాక్యం యొక్క రూపురేఖలేవో తెలుసుకుని ఆ రూపురేఖల్లోనే జీవిస్తారు. ఇదే "సత్యవాక్యం శరణం గచ్ఛామి!"

రోజుకు కొన్ని గంటలు సత్య వాక్కులు పలకడం కాదు, 24 గంటలూ పలకాలి కనుక ఆ అభ్యాసం, "సత్యవాక్ అభ్యాసం".. దానినే శరణుకోరి ఉండాలి. ఏది మనం లక్ష్యంగా పెట్టుకుంటామో, ఏది మన లక్ష్యంగా శరణు పెట్టుకుంటామో అదే మనకు ప్రాప్తిస్తుంది! దేన్ని మనం శరణు పొందమో అది మనకు ఎలా సిద్ధిస్తుంది? కనుక,

**సత్యం శరణం గచ్ఛామి!**

**సత్య వాక్ శరణం గచ్ఛామి!**

**సత్య వాక్య అభ్యాసం శరణం గచ్ఛామి!**

-బ్రహ్మర్షి పత్రీజీ

# ధ్యానం అంటే

ధ్యానం అంటే ప్రార్థన కాదు

ధ్యానం అంటే స్తోత్రం కాదు

ధ్యానం అంటే నామస్మరణ కాదు

ధ్యానం అంటే మంత్రజపం కాదు

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

# ధ్యానం వలన లాభాలు :

1) శారీరక ధారుడ్యం

2) మానసిక ప్రశాంతి

3) బుద్ధి సునిశిత

4) ఆర్థిక సంక్షేమం

5) సుమిత్ర ప్రాప్తి

6) ఆధ్యాత్మిక విజ్ఞానం

# ముక్తి

ధ్యాన సాధన ద్వారానే దివ్యచక్షువు ఉత్తేజితమవుతుంది

ధ్యాన సాధన ద్వారా మనమే గురువులుగా మారుతాం

ధ్యాన సాధన ద్వారా మనమే దైవస్వరూపాలమని తెలుసుకుంటాం

*- బ్రహ్మర్షి పత్రీజీ*